క్లుప్తంగా

టీపీటీఎఫ్ నూతన కార్యవర్గం



అల్లాదుర్గం మండల టీపీటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

అల్లాదుర్గం(మెదక్): తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ అల్లాదుర్గం మండల నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా బాలకిష్టయ్య, ప్రధాన కార్యదర్శి సంజీవయ్య, ఉపాధ్యక్షులు అరుణ, మహేశ్, కార్యదర్శులు సంధ్యారాణి, ఉమాదేవి, అనిత, జిల్లా కౌన్సిలర్‌గా వీరప్పలు ఎన్నికయ్యారు.

నాలుగు విడతల కరవు భత్యం చెల్లించాలి

ఉపాధ్యాయులకు ప్రభుత్వం ఇవ్వాల్సిన నాలుగు విడతల కరవు భత్యం వెంటనే విడుదల చేయాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్‌రామ్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండల నూతన కార్యవర్గ ఎన్నికకు హాజరైన సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 317 బాధిత ఉపాధ్యాయులను స్థానికత ఆధారంగా వారి సొంత జిల్లాలకు వెంటనే బదిలీ చేయాలన్నారు. అల్లాదుర్గంకు మంజూరైన ఉప ఖజానా కార్యాలయం ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

రహదారులపై ధాన్యం ఆరబోయొద్దు



రైతులకు సూచనలిస్తున్న ఎస్‌ఐ శంకర్

పెద్దశంకరంపేట(మెదక్): రహదారులపై రైతులు ధాన్యం ఆరబోయొద్దని ఎస్‌ఐ శంకర్ రైతులకు సూచించారు. శనివారం పెద్దశంకరంపేట నుంచి నార్సింగ్ వెళ్లే దారిలో ఉత్తులూర్ వద్ద రైతులకు రహదారులపై ధాన్యం ఆరబెట్టడం, రాత్రి వేళ రాళ్లు పెట్టి కప్పిపెట్టడం వల్ల తరుచూ ప్రమాదాలు జరిగి ప్రజలు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారన్నారు. రైతులు పోలీసులకు సహకరించాలని, ధాన్యం పంట పొలాల వద్ద ఆరబెట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ సునీత, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా గోపాష్టమి వేడుకలు



చందంపేటలో గోవుకు పూజలు నిర్వహిస్తున్న మహిళలు

చిన్నశంకరంపేట(మెదక్): గోమాతకు, భూమాతకు విడదీయలేని అనుబంధం ఉందని, గోమాత సేవచేయడం పూర్వజన్మ సుకృతమని వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి రామానుజపురం ప్రభాకర్ అన్నారు. శనివారం మండలంలోని చందంపేట వెంకటేశ్వరస్వామి ఆలయంలో, ఆగ్రహారం హనుమాన్ ఆలయంలో గోపాష్టమి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గో ఆధారిత వ్యవసాయం చేయాలని కోరారు. వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై గోవుకు పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ నాయకులు నీల శ్యామ్, రవీందర్, విశ్వనాథ సతీష్, సీవన్‌గౌడ్, మహేశ్, రాజు, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

పశుగ్రాస విత్తనాల పంపిణీ



విత్తనాలు అందిస్తున్న పశువైద్యాధికారులు

టేక్మాల్(మెదక్): రాష్ట్ర పశుసంవర్ధక శాఖ అందించిన పశుగ్రాసం విత్తనాలను శనివారం పశువైద్యాధికారి నాగరాజు, జేఈవో హనుమంతు పశుగ్రాసం విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లోని రైతుల పశువులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిపారు. రైతులు ప్రభుత్వం ద్వారా పంపిణీ చేస్తున్న పశుగ్రాస విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పశువులకు ఎటువంటి వ్యాధులు సోకిన వెంటనే అధికారులను సంప్రదించాలని సూచించారు. రైతుల ఆర్థిక అభివృద్ధి కోసం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సమగ్ర కుటుంబ సర్వే ప్రారంభం

● ఆర్‌డీఓ మహిపాల్

నర్సాపూర్: ప్రభుత్వం చేపట్టిన ఇంటింటి సర్వేకు ప్రజల నుంచి మంచి స్పందన ఉందని ఆర్‌డీఓ మహిపాల్ అన్నారు. శనివారం పట్టణంలో సర్వే ప్రారంభించగా, ఆయన పలు వార్డుల్లో తిరిగి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో సర్వే చేసేందుకు ఎన్యుమనేటర్లకు, సూపర్‌వైజర్లకు అవసరమైన శిక్షణ ఇచ్చామన్నారు. మున్సిపాలిటీలోని అన్ని వార్డులతో పాటు అన్ని గ్రామాల్లో సర్వే ప్రారంభమైందని వివరించారు. సర్వే కోసం వెళ్తున్న ఎన్యుమరేటర్లకు అవసరమైన సమాచారాన్ని ప్రజలు అందజేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, మున్సిపాలిటీ మేనేజర్ మధుసూదన్ తదితరులు ఉన్నారు.

మున్సిపాలిటీలో సర్వే ప్రారంభం

రామాయంపేట(మెదక్): మున్సిపాలిటీ, మండల పరిధిలోని గ్రామాల్లో శనివారం ఇంటింటి సర్వే ప్రారంభమైంది. ఈ మేరకు ఫారాలు ఆలస్యంగా రావడంతో సర్వే కార్యక్రమం లేట్‌గా మొదలైంది. మున్సిపాలిటీ పరిధిలోని 12 వార్డుల్లో ఏర్పాటు చేసిన ఎన్యూమరేటర్లకు కార్యాలయంలో శిక్షణ ఇచ్చారు. గ్రామాల్లో సర్వే కార్యక్రమాన్ని తహసీల్దార్ రజనికుమారి, ఇతర అధికారులు పరిశీలించారు.

పకడ్బందీగా నిర్వహించాలి

హవేళిఘణాపూర్(మెదక్): మండల కేంద్రంలో ప్రారంభమైన సమగ్ర కుటుంబ సర్వేను మెదక్ ఆర్డీవో రమాదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్వే కొనసాగుతున్న తీరు, తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సర్వేకు వచ్చే అధికారులకు ప్రజలు సహకరించాలని ఆమె కోరారు. అధికారులు ప్రజలు తెలపిన వివరాలను నమోదు చేసి పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ సింధూరేణుక, తదితరులు ఉన్నారు.

ఆలస్యంగా సర్వే సామగ్రి

రేగోడ్(మెదక్): మండలానికి కులగణన సర్వే సామగ్రి శనివారం ఆలస్యంగా రావడంతో సర్వే ఆలస్యంగా ప్రారంభమైంది. 49 మంది ఎన్యూమరేటర్‌లకు గానూ ఒక్కో ఎన్యూమరేటర్‌కు 150–175 గృహాలు అప్పగించారు. ఒక్కో కుటుంబానికి సర్వే చేయడానికి సుమారు ముప్పై నిమిషాలు పడుతుందని ఎన్యూమరేటర్లు తెలిపారు. కటుంబ యజమాని తెలిపిన వివరాలనే నమోదు చేస్తున్నామని చెప్పారు.

చిలప్‌చెడ్(నర్సాపూర్): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సమగ్ర కుటుంబ సర్వే శనివారం ప్రారంభమైందని ఎంపీడీఓ ఆనంద్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వే ఫారమ్స్ ఆలస్యంగా రావడంతో, గ్రామాల్లో తొలి రోజు సర్వే కొంత ఆలస్యంగా ప్రారంభమైందన్నారు. ఎన్యుమారేటర్లకు ఒక్కో కుటుంబ సర్వేకు సుమారు గంట సమయం పడుతుందన్నారు. సర్వేకు వచ్చిన ఎన్యుమారేటర్లకు కుటుంబసభ్యులు సహకరించాలని ఆయన కోరారు.

బహిర్గతం చేయకూడదు: ఎంపీడీఓ దామోదర్

చిన్నశంకరంపేట(మెదక్): సమగ్ర కుల గణనలో ఎన్యుమరేటర్లు జాగ్రత్తగా వ్యవహరించాలని, సర్వే చేసిన విషయాలను బహిర్గతం చేయకూడదని ఎంపీడీఓ దామోదర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్యుమరేటర్లు సర్వే విషయాలను, ఫారాలను ప్రభుత్వ కార్యాలయంలో భద్రపర్చాలని సూచించారు. మండలంలో సమగ్ర కుల గణన సర్వే మొదటి రోజున ఎన్యుమరేటర్లకు కేవలం ఐదు సర్వే ఫారంలే అందించారు. కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేయడంతో పాటు కులం, ఆర్థికం ఇతర విషయాలను కోడ్ రూపంలో పూర్తి చేయాల్సి ఉండడంతో ఆలస్యం అవుతుందన్నారు. ఒక్కో కుటుంబ సర్వే 30 నుంచి 45 నిముషాల వరకు పడుతుందని ఎన్యుమరేటర్లు చెబుతున్నారు.



హవేళిఘణాపూర్‌లో సమగ్ర కుటుంబ సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీవో రమాదేవి



నర్సాపూర్‌లో సర్వేను పరిశీలిస్తున్న ఆర్‌డీఓ, పక్కన ఇతర అధికారులు



రామాయంపేటలో సర్వే నిర్వహిస్తున్న ఎన్యూమరేటర్లు

మొదటి రోజు ఆలస్యం

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలో మొదటి రోజు శనివారం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో 317 కుటుంబాలను సర్వే చేసినట్లు ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ కలీముల్ల సర్వేను పరిశీలించారు. కాగా మండలంలో 85 మంది ఎన్యూరేటర్లు వారికి కేటాయించిన గ్రామ పంచాయితీలలోని వార్డుల్లో సర్వే చేశారు. కాగా ప్రజలకు ఒక్కో ప్రశ్న అడుగుతూ వివరాలు, కోడ్‌లు నమోదు చేసేందుకు సుమారు గంట సమయం పట్టింది. దీంతో సర్వే మొదటి రోజు ఆలస్యం అయింది.



కౌడిపల్లిలో..

ఆస్తుల వివరాలు నమోదు చేయించాలా?

వెల్దుర్తి(తూప్రాన్): మూడు రోజులుగా ఇంటింటికీ స్టిక్కర్లు వేసిన అధికారులు శనివారం కుటుంబ సర్వే ప్రారంభించారు. ఉమ్మడి వెల్దుర్తి మండలంలో సర్వే ప్రక్రియ సజావుగా చేపట్టడానికి 95 బ్లాక్‌లుగా విభజించి 95 మంది ఎన్యూమరేటర్లతో పాటు మరో తొమ్మిది మందిని రిజర్వ్‌గా నియమించారు. 10 బ్లాకులకు ఒకరు చొప్పున మరో పది మంది సూపర్‌వైజర్‌లను ఏర్పాటు చేశారు. శనివారం మధ్యాహ్నం నుండి ఎన్యూమరేటర్లు వారికి కేటాయించిన బ్లాకుల్లో ఇళ్లవద్దకు వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలు సేకరించారు.

ఒక్క కుటుంబానికి గంటకు పైగా సమయం

క్షేత్రస్థాయిలో ఇంటింటికీ తిరిగి సర్వే చేస్తున్న ఎన్యూమరేటర్లకు ఒక్క కుటుంబ సర్వే పూర్తవడానికి గంటకు పైగా సమయం పట్టింది. ఉమ్మడి మండలంలో శనివారం 372 కుటుంబాలకు సంబంధించి సమగ్ర సర్వే చేపట్టినట్లు ఎంపీఓ విఘ్నేశ్వర్ తెలిపారు. సర్వేలో ఆస్తులు, అప్పుల వివరాలు తప్పనిసరిగా నమోదు చేయించాలా ? వద్దా ? ఒకవేళ ఆస్తుల వివరాలు పూర్తిగా వెల్లడిస్తే ప్రభుత్వ పథకాల నుంచి తొలగిస్తారా అని అనుమానాలను కొందరు గ్రామస్తులు వ్యక్తం చేశారు. ఒక వ్యక్తికి స్వగ్రామంతో పాటు మరో చోట వ్యవసాయ భూములు ఉన్నట్లయితే వాటి వివరాలు ఎక్కడ నమోదు చేయించాలి అంటూ అడిగి తెలుసుకున్నారు.



వెల్దుర్తి(తూప్రాన్): బండమీదిపల్లిలో సర్వే ప్రక్రియ పరిశీలిస్తున్న ఎంపీఓ విఘ్నేశ్వర్

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి

● టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటరామిరెడ్డి

టేక్మాల్(మెదక్): సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, ఉపాధ్యాయ ఉద్యోగులందరికీ నగదు రహిత వైద్య విధానాన్ని అమలు చేయాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటరామిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ... రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ బిల్లులను మంజూరు చేయాలని, ఈ కుబేర్ విధానాన్ని రద్దు చేసి, పాత పద్ధతిలోనే బిల్లుల చెల్లింపులు జరగాలన్నారు. స్థాయి ఇంటిగ్రేటెడ్ స్కూల్ విధానాన్ని రద్దు చేసి, ఉన్న పాఠశాలల్ని బాగు చేయాలని తెలిపారు. మూడు, నాలుగు దశాబ్దాలుగా ఉద్యోగ విధులు నిర్వర్తించి రిటైర్డ్ అయ్యే ఉపాధ్యాయుల ఉద్యోగుల పెన్షనర్ బెనిఫిట్‌లు 30 రోజుల్లో చెల్లించాలన్నారు. విద్యాశాఖలో ఉన్న అన్ని పర్యవేక్షణ స్థాయి పోస్టులైన మండల విద్యాధికారులు, జిల్లా విద్యాధికారులు పోస్టులు మంజూరు చేయాలన్నారు. ఉపాధ్యాయులకు సర్వీస్ రూల్స్ అమలు చేయాలని, 317 జీవో బాధిత ఉపాధ్యాయులందరికీ న్యాయం చేయాలని, పెరిగిన ధరల కనుగుణంగా పీఆర్సీని ప్రకటించి అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సమావేశంలో రాష్ట్ర కౌన్సిలర్లు యాదగిరి, హీరాలాల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీపీటీఎఫ్ నాయకులు

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన



చందంపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన తహసీల్దార్ మన్నన్



నర్సాపూర్ రూరల్: రెడ్డిపల్లి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని చందంపేట గ్రామంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ మన్నన్ పరిశీలించారు. శనివారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధాన్యం కాంటా చేయడంతో పాటు వెంట వెంటనే ధాన్యాన్ని తరలించాలని నిర్వాహకులకు సూచించారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ధాన్యం కంటా వేగవంతం చేయాలని తెలిపారు.

రైతులకు ఇబ్బందులు రాకుండా చూడాలి

నర్సాపూర్ రూరల్: కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు రాకుండా చూడాలని నర్సాపూర్ తహసీల్దార్ శ్రీనివాస్ నిర్వాహకులకు సూచించారు. శనివారం ఆయన మండలంలోని రెడ్డిపల్లి, మంతూర్ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొనుగోలు వివరాలు వెంటనే ట్యాబ్‌లో నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం గౌరీశంకర్, నిర్వాహకులు పాల్గొన్నారు.

గోపాలమిత్ర సేవలను సద్వినియోగం చేసుకోవాలి

రేగోడ్(మెదక్): గోపాలమిత్ర సేవలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని గోపాలమిత్ర సూపర్‌వైజర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని దోసపల్లి గ్రామంలో ఉమ్మడి మెదక్ జిల్లా పశుగణాభివృద్ధి సంఘం పశుసంవర్ధక శాఖ సహకారంతో గర్భకోశ వ్యాధి నివారణ చికిత్స శిబిరాన్ని పశువైద్యాధికారి డాక్టర్ వీరేశం శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. పాడి పశువులకు గర్భకోశ వ్యాధులు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, పశువుల ఎద లక్షణాలు గుర్తించాలన్నారు. లేగ దూడల్లో నట్టల నివారణ మందులు తాగించడం వల్ల అవి ఎదుగుతాయని వివరించారు. గోపాలమిత్రుల ద్వారా ఏద సూది వేయించడం వలన మేలు జాతి దూడలు జన్మిస్తాయని తెలిపారు.



మాట్లాడుతున్న శ్రీనివాస్

డప్పు కళా ప్రదర్శన

మిరుదొడ్డి(దుబ్బాక): మలేషియా తెలంగాణ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న దశాబ్ది ఉత్సవాల్లో తెలంగాణ కళాకారులు డప్పు కళా ప్రదర్శనను మారుమోగించారు. భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్ మామిడి హరికృష్ణ ప్రోద్బలంతో శనివారం మలేషియాలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహం వద్ద, అలాగే ట్విన్ టవర్స్, మార్వెడ్ ఎగ్జిబిషన్ సెంటర్‌లోను కళా ప్రదర్శన నిర్వహించినట్లు ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ అవార్డు గ్రహీత అందె భాస్కర్ తెలిపారు.

విద్యార్థులు మొక్కలను నాటి, సంరక్షించాలి

● కళాశాల ప్రిన్సిపాల్ శశిధర్

చిన్నశంకరంపేట(మెదక్): విద్యార్థులు మొక్కలను నాటి, వాటిని సంరక్షించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శశిధర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు మొక్కలు నాటారు. శనివారం జూనియర్ కళాశాల ఆవరణలో విద్యార్థులు, అధ్యాపకులు స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహించి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడారు. విద్యార్థులు ఎన్‌ఎస్‌ఎస్ సేవా రంగంలో కూడా పాల్గొని సేవా కార్యక్రమాలు చేయాలని కోరారు.



మొక్కలు నాటుతున్న విద్యార్థులు

సాంకేతిక విద్యకు పాఠశాలల ఎంపిక

చిన్నశంకరంపేట(మెదక్): మెదక్ జిల్లాలో మెగాశ్యామల ట్రస్ట్ ద్వారా అందించే సాంకేతిక విద్యకు మండలంలోని ఐదు పాఠశాలలు ఎంపికైనట్లు ఎంఈఓ పుష్పవేణి అన్నారు. మండలంలోని మిర్జాపల్లి, ధరిపల్లి, సూరారం జెడ్పీపాఠశాలలు, మందాపూర్, జంగరాయి యూపీఎస్ పాఠశాలలు సాంకేతిక విద్య బోధనకు ఎంపికైనట్లు వివరించారు. ఈ ఐదు పాఠశాలల్లో బెస్డ్ లెర్నింగ్ టెక్నాలజీ ప్రోగ్రామ్‌ను మెగాశ్యామల ఆధ్వర్యంలో విద్యార్థులకు అందించనున్నట్లు తెలిపారు. ఐదు పాఠశాలల హెచ్‌ఎంలకు ఈ నెల 12న మెదక్ కలెక్టరేట్‌లో ఒక రోజు అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలకు ముందుగా ట్యాబ్‌లను అందించనున్నట్లు చెప్పారు.

గురువుల బాధ్యత గొప్పది

మిరుదొడ్డి(దుబ్బాక): విద్యార్థులను తీర్చిదిద్దడంలో గురువుల బాధ్యత చాలా గొప్పదని కాంగ్రెస్ నాయకుడు చెరుకు అమరేందర్‌రెడ్డి అన్నారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు మద్దెల రాజేశ్ అధ్యక్షతన మండల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించిన వారిని శనివారం ఘనంగా సన్మానించారు. మాజీ ఎంపీపీ సాయిలు, లక్ష్మి, భూమాగౌడ్, జైపాల్‌రెడ్డి, భూపాల్‌గౌడ్, భూపతి గౌడ్, మహేందర్, సాజిత్, హర్షత్, కిష్టయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.



టీచర్లను సన్మానిస్తున్న నాయకులు

సంక్షిప్త వార్తలు

◆ **నేడు వీహెచ్‌పీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం**

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంటలో ఆదివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు జిల్లా విభాగ్ సంఘటన కార్యదర్శి మల్లేశం ఒక ప్రకటనలో తెలిపారు. కేజీఎస్ ఆస్పత్రిలో ఉదయం 9 నుంచి నిర్వహించే ఈరక్తదాన శిబిరంలో దాతలు రక్తదానం చేసి, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

◆ **చెరువులో వదిలిన చేప పిల్లలు**

అల్లాదుర్గం(మెదక్): మత్స్యకారులకు సబ్సిడీ కింద ప్రభుత్వం ఇచ్చిన చేప పిల్లలను మండల కేంద్రం అల్లాదుర్గం, ముస్లాపూర్ చెరువుల్లో శనివారం కాంగ్రెస్ నాయకులు వదిలారు. కార్యక్రమంలో వట్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ లక్ష్మి, మత్స్యశాఖ అధికారులు రామకృష్ణ, భరత్, అంజయ్య, కాంగ్రెస్ నాయకులు బల్‌రాం, శేషారెడ్డి, సురేశ్ గుప్తా, నర్సింలు, బేతయ్య, చంద్రశేఖర్, వెంకట్, పోచయ్య, సాయిబాబా, తదితరులు పాల్గొన్నారు.

◆ **సన్మానం**

పాపన్నపేట(మెదక్): విదేశీ పర్యటనలో భాగంగా కెనడా వెళ్లి వచ్చిన మండలంలోని గెజిటెడ్ హెచ్‌ఎం విజయలక్ష్మిని శనివారం మండలంలోని లింగాయపల్లి, చీకోడు పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించారు.

ఓటరుగా దరఖాస్తు చేసుకోవాలి

● మెదక్ ఆర్డీవో రమాదేవి

రామాయంపేట(మెదక్): పట్టణంలో 18 ఏళ్లు నిండిన వారు విధిగా ఓటరుగా దరఖాస్తు చేసుకోవాలని మెదక్ ఆర్డీవో రమాదేవి సూచించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలో ఉన్న పోలింగ్ బూతులను శనివారం మెదక్ ఆర్డీవో పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఈ పోలింగ్ బూతుల్లో నిభందనల మేరకు అన్ని సదుపాయాలు కల్పించాల్సి ఉందన్నారు. ఓటు హక్కు వినియోగం కోసం కొత్త ఓటర్లు ఆర్డీవోకు దరఖాస్తులు అందజేయగా, ఆమె వాటిని పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రజనికుమారి, ఇతర అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

నర్సాపూర్: పట్టణంలో 18 ఏళ్లు నిండిన యువతీయువకులు తమ పేరును ఓటరుగా నమోదు చేసుకోవాలని మండల తహసీల్దార్ శ్రీనివాస్ కోరారు. శనివారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు రోజుల పాటు ప్రత్యేక క్యాంపెయిన్ చేపట్టామని చెప్పారు. మండలంలోని అన్ని పోలింగ్ స్టేషన్ల వారీగా బూత్ లెవెల్ ఆఫీసర్లు ఓటర్ల జాబితాలతో ప్రజలకు అందుబాటులో ఉన్నారన్నారు. మండలంలో కొత్తగా 73మంది తమ పేరును నమోదు చేసుకున్నారని, పేర్లు తొలగించడం, అడ్రెసులు మార్పు కోరుతూ మండలంలో 183 దరఖాస్తులు వచ్చాయని వివరించారు. ఆదివారం సైతం బూత్ లెవెల్ ఆఫీసర్లు పోలింగ్ స్టేషన్లలో అందుబాటులో ఉంటారన్నారు. ఓటర్లు తమ పేర్లను పరిశీలించుకోవాలని కోరారు.

వెల్మకన్నలో..

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వివిధ గ్రామాల్లో ఓటరు నమోదు ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. అధికారులు సూచనతో వెల్మకన్నతో పాటు వివిధ గ్రామాల్లో బీఎల్‌ఓలు అంగన్‌వాడీ టీచర్లు పోలింగ్ కేంద్రాలు, గ్రామ పంచాయతీ వద్ద 18ఏళ్లు నిండిన వారితో పాటు 17ఏళ్ల నిండిన వారిని సైతం ముందస్తు ఓటరుకు దరఖాస్తులు తీసుకున్నారు. దీంతోపాటు సరవరణలు దరఖాస్తులు తీసుకున్నారు.

ప్రత్యేక శిబిరం ఏర్పాటు

శివ్వంపేట(నర్సాపూర్): ఓటుహక్కు నమోదు కోసం శనివారం పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. మండల వ్యాప్తంగా ఉన్న 52 పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్‌ఓలు ఓటరు నమోదు చేపట్టారు. తప్పుల సవరణతో పాటు యువతి, యువకులు ఓటుహక్కు కోసం నమోదు చేసుకునే అవకాశం ఉందని ఉప తహసీల్దార్ షఫీయొద్దీన్ అన్నారు.

స్పెషల్ డ్రైవ్

పెద్దశంకరంపేట(మెదక్): ఓటరు నమోదును 18 ఏళ్లు నిండిన యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ గ్రేస్‌బాయి అన్నారు. శనివారం పెద్దశంకరంపేటతో పాటు ఆయా గ్రామాల్లో ఓటరు నమోదుపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల వద్ద నూతన ఓటర్ల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఆదివారం కూడా స్పెషల్ డ్రైవ్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి వెంకటరాములు, బీఎల్‌ఓలు స్వరూప, స్వాతి తదితరులు ఉన్నారు.

చందంపేట గ్రామంలో..

చిన్నశంకరంపేట(మెదక్): ఓటరు నమోదుకు రెండు రోజులు ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ మన్నన్ తెలిపారు. శనివారం మండలంలోని చందంపేట గ్రామంలో నిర్వమిస్తున్న ఓటరు నమోదు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 10 ఏళ్లు నిండిన యువతి యువకులు ఓటరు నమోదు చేసుకోవాలని కోరారు. రెండు రోజుల పాటు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల వద్ద ఓటరు నమోదుకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎల్‌ఓ స్వప్న ఉన్నారు.



రామాయంపేటలో కొత్త ఓటర్లు ఓటు హక్కు కోసం ఆర్డీవోకు దరఖాస్తు అందజేస్తున్న కొత్త ఓటర్లు



నర్సాపూర్ పోలింగ్ స్టేషన్‌లో ఉన్న బూత్ లెవెల్ ఆఫీసర్ల విధులను తనిఖీ చేస్తున్న తహసీల్దార్



చిన్నశంకరంపేట(మెదక్): చందంపేటలో ఓటరు నమోదు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్



శివ్వంపేట(నర్సాపూర్): తాళ్లపల్లితండాలో ..